

# అహింస

## నవులూరి వెంకటేశ్వరరావు

"నగరపాలక సంస్థ అన్నిరకాల మాంసం దుకాణాలకు సెలవు ప్రకటించింది ఈరోజు. ప్రధాన ఆరోగ్యాధికారి ఈ ఉత్తర్వులను ఉల్లంఘించే వాళ్లమీద కఠిన చర్యలు తీసుకుంటానని తాటాకు చప్పుళ్లు చేశాడు!" అక్కతో అన్నాడు వాడు చదివిన పేపరు మూస్తూ.

నిజానికా ఆ మాటలు తండ్రిని ఉద్దేశించి కూడా అన్నవి.

వీరభద్రం కొడుకు మాటలు విన్నాడు. ప్రతి సంవత్సరం ఈరోజున ఉపవాసదీక్ష. మౌనవ్రతం, పుస్తక పఠనాలతో గడుపుతాడు. కార్యాలయానికి ఎలాగూ సెలవు. ఇల్లు కదలడు. కళ్లతో కూడా కోపాన్ని వ్యక్తం చెయ్యడు. చెట్టు నుంచి పూలు తెంపడు, కొమ్మ వంచడు, పాలు తాగడు.

"ఒక్కరోజు కూడా, అది లేకపోతే ముద్ద మింగుడు పడదా నీకు? పేపరంతా చదివి అదొక్కటే ముఖ్యమైన వార్తలా చెబుతున్నావు!" తమ్ముడితో అంది.

"మాంసం ఈరోజు మాత్రం ఎందుకు అమ్మకూడదు. ఎందుకు తినకూడదు? ఆ పనులు ఈరోజున చేస్తే తప్పు, మిగతా రోజులలో చేస్తే ఒప్పు! ఈరోజు మానటం ద్వారా మిగతా రోజుల్లో తప్పు చేస్తున్నాం అని ఒప్పుకుంటున్నట్లా? తప్పు చెయ్యకుండా ఉండటం మన అధీనంలో ఎలాగూ లేదు కాబట్టి, ఒకటి రెండు రోజులన్నా ఉందామన్న రాజీ ధోరణేమో!" మహా మేధావిలా అన్నాడు.

"ఆయనకు స్మృత్యంజలి ఘటించే విధానంగా దాన్ని భావించాలి. పెడర్థాలు తీయకూడదు!" అక్క హితవు పలికింది.

"వ్రతాలు, కంటితుడుపు విధానాలు అవలంబించటమే ముఖ్యం. సూత్రాలను జీవితంలో అనుసరించటం కాదు, సిద్ధాంతాల ప్రకారం నడుచుకోవటం కష్టమైన పని!" జీవనానుభవంతో పండిన ముదుసలి అన్నాడు.

అన్నీ వింటున్నాడు వీరభద్రం. నోరేకాక, చెవులూ కళ్లూ కూడా మూసుకుని ఉంటే మౌనాన్ని పాటించటం కాస్త తేలికే. నచ్చని అభిప్రాయాలూ ఎవరైనా వ్యక్తం చేస్తున్నప్పుడు మౌనంగా ఉండటం చాలా కష్టం. ఈరోజు తను తట్టుకోవలసిన పరీక్షలలో కొడుకు వాచాలత కూడా ఒకటి. తెలివితేటలు కలిగి ఉండి, వాటిని ప్రదర్శించకుండా నిగ్రహంతో, వినమ్రతతతో ఉండగలిగే సంస్కారం మనిషికి అలవడాలి. ఆ విషయం మరికొంత వయసు వచ్చిన తర్వాతనన్నా వాడు తెలుసుకుంటే సంతోషం. కిటికీ దగ్గరగా వెళ్లాడు వీరభద్రం.

కిటికీలో నుంచి పారిజాతాల సువాసన లోపలికి వస్తోంది. పొద్దున్నే పళ్లు తోముకుంటూ ఆవైపు వెళతాడు. అప్పుడు నేలంతా పరుచుకుని ఉంటాయి పూలు. అవి చెట్టు రాల్చిన ఆనందభాష్పాలో, దుఃఖాశ్రువులో ఎవరికెరుక? పూజా కార్యక్రమం కూడా ఒక కాలకృత్యం. పూలు లేని పూజలేమిటి? ఆ చెట్టు ఆ సామగ్రినిస్తుంది. దాని ముఖం అది ఇచ్చేదేమిటి, బలవంతంగా కోస్తారు. ప్రహరీగోడకు మించి ఎత్తుగా ఎదిగింది చెట్టు, అవతల ఏం జరుగుతోందో తెలుసుకోవాలన్న కుతూహలంతో, కొమ్మలను చేతుల్లా అవతలికి కూడా చాచింది నిస్వార్థం

మీది పాఠం చెబుతూ. ఈ ప్రాంతంలో ఏదో ముంచుకు పోతున్నట్టు, పిచ్చికుక్క తరుముతున్నట్లు ఆగమేఘాల మీద ఇటుపక్కకు కొవ్వు బలిసిన జనం పరుగు నడకతో వస్తారు. ఉత్త చేతులతో పోవటం ఎందుకన్నట్లో, ఊరికే దొరికే వాటిని ఎందుకు వదిలెయ్యాన్నట్లో పూలు కోసుకుపోతారు. కొమ్మలు, ఆకులు విరిచిపోతారు. రక్తం చిందితేనే హింస.

ఇంటి చుట్టూ మొక్కలు పెంచిన ఘనత, శ్రమ కొడుకువి. వాడు పొద్దున్నే లేస్తాడు. తోటపని చేస్తాడు. కొండ ప్రాంతం కాబట్టి నేలంతా రాళ్లమయం. గునపం తో అతి కర్కశంగా రాళ్లన్నీ పెకలించి వేశాడు. భూమి నంతా తవ్వి, గుల్లగా చేశాడు. గుట్టలు గుట్టలుగా రాళ్లొ చ్చాయి. వాడు పడిన హింసకు, వాడు పెట్టిన హింసకు రుజువులు రాళ్లు, నేల గుల్లబారుతనం. ఒకపక్క చదువుకుంటూ ఇంట్లో ఈపనీ ఆపనీ చేస్తాడు. మొక్కలు పెంచాడు. నేలను తవ్విన కాలంలో వాడి చేతులు బొబ్బలెక్కాయి. అవి చితికి రక్తం వచ్చింది. అరిచేతులు కాయలు కాచాయి. మొద్దుబారాయి. అలా జరిగితేనేగానీ మొక్కలు బతకటానికి, పెరగటానికీ వీలవలేదు. మొక్కలు వాడి ప్రాణాలు. నెలల కొలది పండించిన పంటకు రైతుకు ఉన్న బంధమే మొక్క లకూ వాడికీ మధ్య ఉంది. వాడి శరీరం కండలు తిరిగి ఉంటుంది. మంచి చెయ్యటానికి, చెడు చెయ్యటానికి పనికొచ్చే శక్తి పొంగిపొర్లుతున్న శరీరం.

“అహింసావాదాన్ని బోధించి, దాన్ని ఆచరించి చూపిన మహాత్ముడు ఎందుకు హింసకు బలి అయ్యాడు? బలవన్మరణం అహింసామయ జీవితానికి అందే జీతంగా భావించాలా?”

వాదిస్తూనే, వాడు జంపర్‌ను కసిగా రాతిగోడ గుండెల్లోకి దిగకొడుతున్నాడు. అలా కొడితేనే కానీ అది దిగదు. మేకు దిగితేనే కానీ ఏసుదైనా, బుద్ధుడిదైనా పటం వేలాడేసే వీలులేదు. వాడిది ఎదుగుదల ఇంకా పూర్తిగా నిలిచిపోని శరీరం. వయసును మించి ఎదిగాడు ఇప్పటికే. వాడి కండల కదలికలో అందమైన ఆటవిక లక్షణం, లయ కనిపిస్తాయి. మనిషి ‘నాగరిక’ ప్రపంచంలో జీవించటానికీ ఆటవిక మనస్తత్వం, శారీరక శక్తి అవసరమవుతున్నాయి. అవి అంతగా అవసరమవుతున్నాయి కనుక నాగరికత కొరవడింది అనుకోవాలేమో. నాగరిక నడవడిన, పూర్తి మానవతను సాధించటం ఎప్పటికీ భ్రమగానే ఉండిపోతుంది. వీరభద్రం విచారించాడు. తనతో తను మనసులో సంభాషించటం వ్రతభంగం కిందికి రాదు. మాట్లాడ కుండా ఉండగలం కానీ, మనసును ఊరుకోబెట్టలేం కదా!

రెండు నిమిషాల్లోనే జంపర్‌తో గోడకు కన్నం కొట్టడం, ప్లగ్గు కన్నంలోకి తోసి మేకును దింపెయ్యటం చేశాడు కొడుకు. “నాన్నగారికి ఈ దినం వీడు ఇచ్చే కానుక ఇది!” అంటూ మేకుకు గాంధీపటం తగిలిం చాడు. కాస్త దూరంగా జరిగి దాన్ని పరికించాడు వాడు. తన పనిని తాను సరిచూసుకోవటమో, మెచ్చుకోలుగా పటంలోని వ్యక్తిని చూడటమో అది. మరోరోజయితే కొడుకుని అడిగి ఉండేవాడు వీరభద్రం. వాడు వాళ్ల అక్కవైపు తిరిగాడు. ఏదో విషయం పూర్తిగా తేలాలి అన్నట్లు.

“అణుబాంబులతో, అహింసా విధాన వినియో గానికి భంగం కలగదా అని ఎవరో అడిగితే గాంధీ అన్నా రట- బాంబులు పడుతున్నప్పుడు అహింసా విధానాన్ని అనుసరించేవాళ్లు వాటి నుంచి ఎలా తప్పించుకోవాలా అని చూడటంకాక, విమాన చోదకుడి సంక్షేమం గురించి ప్రార్థించాలి అని. కంటికి కన్ను, పంటికి పన్ను తీసే ప్రతీకార పద్ధతికి అలవాటుపడితే లోకంలో అందరూ అంధులే మిగులుతారు అన్నాడాయన. ఆయనను హత్యచేసిన వాళ్లను ఉరి తీయకుండా మరో శిక్ష వేసి ఉండవలసిందా? ఎన్నేళ్లు చర్చించినా సమా ధానం దొరకని ప్రశ్నేమో ఇది. ఉరిశిక్షను గాంధీ, బుద్ధుడు, మహావీరుడు పుట్టిన గడ్డే రద్దు చేయలేక పోయింది. యుగోస్లేవియా మీద అమెరికా బాంబులు ఎందుకు కురిపించింది? శాంతిని నెలకొల్పటానికి రెండవ ప్రపంచం యుద్ధం ఎప్పుడు ముగింపుకు వచ్చింది? జపాను మీద అణుబాంబు ప్రయోగించి పరమహింసకు పాల్పడిన తర్వాత ఒక దేశం మీద మరొక దేశం అణుబాంబులతో దాడి చెయ్యకుండా ఉండాలంటే ఆ దేశం కూడా అణుబాంబు కలిగి ఉండాలి. ఏమిటీ పొంతనలేని వింతలు? బౌద్ధమతం పరిఢవిల్లిన శ్రీలంకలో రావణకాష్టం ఎందుకు కొనసాగు తోంది?”

శకుంతల వచ్చి కొడుకును ఉపన్యాసం ఆప మంది. ఆపాడు. అప్పుడు ఆమె అందుకుంది.

“ఇంటినిండా గొంగళి పురుగులు. పడకగదిని చేరాయి. నిన్నా, మొన్నా, ఒళ్లంతా దురదలు. వాటిని చూస్తుంటే కడుపులో దేవుతోంది. మీకెవరికీ అది పట్టి నట్లు లేదు. చర్మాలు స్పర్శజ్ఞానం కోల్పోయ్యాయా?”

పారిజాతం చెట్టు నిండా గొంగళిపురుగులు పట్టాయి. నల్లగా, ముళ్లు ముళ్లగా శాపంలా. ఈ రూపం

పోవటానికి తల్లకిందులుగా తపస్సు చెయ్యాలి. హింసను అనుభవించాలి, హింసకు పాల్పడాలి. చెట్టును పట్టి పీడిస్తున్నాయి. అది వాటికి ఏ అపకారం చేసి ఉండకపోయినా, దేవుడికి పూలిచ్చి పుణ్యం చేసుకుంటున్న ఆ చెట్టు ఏ పాపం చేసిందో ఈ శిక్షకు ఎర అవుతోంది. పోనీ, ఇది ఒక పరీక్ష అనుకుందాం. పచ్చటి ఆకుల మీద అత్యాచారం జరుగుతోంది.

ఏ బుద్ధీ లేకపోయినా, హింసకు పాల్పడుతున్నాయి రేపటి సీతాకోక చిలుకలు. రాబోయే రూపు, తపస్సుకు ప్రతిఫలం అనుకోవాలా, పాపానికా? పుట్టిన తర్వాత బతకాలి ఎలాగో ఓలాగా మనిషైనా, పురుగైనా. బతకటం గురించి ఏదో ఒక హింసకు పాల్పడాలి. బ్రతుకు- హింసకు పర్యాయపదమేమో.

"గొంగళి పురుగులు పోవాలంటే చెట్టు కొట్టెయ్యటమే మార్గం!" అంది అమ్మాయి.

"ఎంత తేలికైన తరుణోపాయం చెప్పావక్కా! ఏనాడైనా ఒక లోటాడు నీరు ఆచెట్టుకు పోశావా? గునపం పట్టుకొన్నావా? ఏ చెట్టునైనా పసిపాపలా పెంచావా? గునపం మాట వదిలెయ్యి. పేనా గట్టిగా పట్టుకుని గంట రాస్తే వేళ్లు తిమ్మిర్లు ఎక్కుతాయి. అమ్మను సేవకు పిలుస్తావు. మనసూ అతి సున్నితం అన్నట్లు మాటలు రాలుస్తావు.

"ఇంతవరకు అహింసను బోధించావు. బౌద్ధంలోకి మారిపోయినట్లు. అదంతా నాన్నగారి మెప్పు గురించి. అదే నోటితో చెట్టును నరికేయమంటున్నావు. చెట్టూ చస్తుంది. పురుగులూ చస్తాయి. అసలు నీ నమ్మకాలేమిటి, నీ నిజస్వరూపం ఏమిటి?"

"బాగుందిరా నీ వాదన! చెట్టుకూ, జీవికీ తేడా లేదూ? చెట్టును కొట్టెయ్యటమూ హింస కిందికి వస్తుందా! అలా ఆలోచించుకుంటూపోతే, బుద్ధి వింత పోకడలు పోయి మాంసాహారానికి, శాకాహారానికి తేడా లేదు అని తేలుతుంది. అహింసను ప్రేమిస్తూ గొంగళీల చేత హింసింపబడదామా?" తల్లి అంది.

మౌనంగా ఉండటం.

'ఎలాంటి పని చేశాను?' అనుకున్నాడు వీరభద్రం. తన నుంచి సమాధానం ఆశిస్తూ తనుకు తాను వేసుకున్న ప్రశ్న కాదది. ఆశ్చర్యం నుంచి కోలుకుంటూ, పశ్చాత్తాపంతో విలపిస్తూ అనుకున్న మూడు పదాలవి.

'తెలుస్తూనో, తెలీకుండానో బహిర్గత హింసకు పాల్పడకుండా మనిషి క్షణం ఉండలేడు!' అని మహాత్ముడు చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. ఆ మాటలు ఓదార్పు కలిగించటం లేదు ఈ క్షణాన. అలా తనను తాను సమర్థించుకోవటం ఆత్మవంచన. హింసకు చోటులేని జీవితం లేదు అనుకుని ప్రవాహానికి కొట్టుకు పోయేట్లయితే మూడొందల అరవై అయిదు రోజులలో ఈ ఒక్కరోజు హింసకు దూరంగా ఉందామని చేసే ప్రయత్నం అర్థరహితం, మోసం.

'హింస అనే ఘాతుకం నుంచి విముక్తి అయ్యే ప్రయత్నం సదా కొనసాగించాలి!"

తన నిగ్రహం ఒక్కరోజున, ఒక్క పరీక్షకే చెదిరింది. వాడి వయసెంత, తన వయసెంత. ముప్ఫయి సంవత్సరాల తేడా, వయసు మీదపడి, జీవితాను భవజ్ఞుడిని అనుకున్న తనకన్నా వాడే హుందాగా తోచాడు.

చేతులు కాయలు కాచేట్లు సేవలు చేసి మొక్కలు పెంచి, వాటిని ప్రేమించిన వాడి బాధను అర్థం చేసుకోలేదు తను. అలాంటి పరిశ్రమ చేసినంత మాత్రాన ఆ హింసకు పాల్పడే హక్కు వాడికి లేదు, అది వేరే విషయం. తనలోని హింసాపూరిత స్వభావం అసహ్యంగా, తనను వెక్కిరిస్తూ బయటపడింది.

మధ్యాహ్నమంతా మంచాన పడి నిద్రోయి నాలుగ్గంటలప్పుడు లేచి ఇంటిపక్కకు వెళ్లాడు. పారిజాతం చెట్టు దగ్గర తల్లీ కొడుకులు నిలబడి ఉన్నారు. పొగలేస్తోంది. క్రింద మంట. ఎండుటాకులు మండుతున్నాయి. దగ్గరగా వెళ్లాడు వీరభద్రం. చెట్టు మొదట్లో నున్న గొంగళిపురుగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కొన్ని మంటలోకి జారిపడి ఆహుతి అవుతున్నాయి. కొడుకు మంట ఎగదోస్తున్నాడు. భార్య కొంచెం దూరంలో నిలబడి చూస్తోంది. వాడి చర్యకు ఆమె ప్రోత్సాహం.

ఉద్రేకం కట్టను తెంచుకుంది. కేకలు వేయబోయాడు వీరభద్రం. గొంతు ఎవరో నొక్కిపట్టినట్టు మాట వెలువడలేదు. చేయి మాత్రం చెప్పిన పని చేసింది. వాడి లెంపలు వాయించింది. కళ్లు నిప్పులు కురిపించాయి. పిల్లల మీద ఇలా ఏనాడూ చేయి చేసుకోలేదు. వాడి మొఖంలో ఎలాంటి భావోద్రేకం చోటు చేసుకోలేదు. కాకపోతే వాడి కళ్లనిండా నీరు... నీరు...

ఎలా తన చర్యను సమర్థించుకునేట్లు?

తనది భూతదయకు సంబంధించిన హింస కాబట్టి అది సమర్థనీయమే అని సమాధాన పడగలిగితే బాగుండు.

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 14 అక్టోబర్ 2000